క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలను అర్చకులు యల్లాప్రగడ నాగేశ్వర్ రావుశర్మ నిర్వహించారు. ఆలయానికి అనేక మంది భక్తులు తరలివచ్చి విష్ణు సహస్రనామాలను పఠించారు. గోత్రనామాలతో అర్చనలు చేయించుకొని కొబ్బరికాయలను కొట్టి తీర్థప్రసాదాలను స్వీకరించారు. దీంతో ఆలయం అంతా గోవిందస్మరణతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అలువాల శ్రీనివాస్, కత్తెర శ్రీనివాస్, దీనబంధవస్వామి, బ్రహ్మం, సదానందం పాల్గొన్నారు.

పోలీస్ యాక్ట్‌ను అతిక్రమిస్తే చర్యలు

ములుగు రూరల్: జిల్లాలో ఈ నెల 31 వరకు కొనసాగుతున్న పోలీస్ యాక్ట్‌ను అతిక్రమిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని డీఎస్పీ రవీందర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులతో డీఎస్పీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు నేడు(సోమవారం) నిరసన కార్యక్రమాలకు అనుమతులు కోరగా నిరాకరించారు. సోమవారం జిల్లాలో రాష్ట్ర మంత్రుల పర్యటన నేపథ్యంలో నిరసన కార్యక్రమాలను అనుమతులు ఇవ్వడం కుదరని తెలిపారు. పోలీస్ అధికారుల ఉత్తర్వులను ఉల్లఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని సూచించారు.

నేడు నిరసన

ములుగు రూరల్: కాంగ్రెస్ పార్టీ అవలంభిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా నేడు(సోమవారం) జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు మొర్రి రాజు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జర్నలిస్టులపై, జిల్లా ప్రజలపై అప్రజాస్వామికంగా చేస్తున్న దాడులకు నిరసనగా చేపట్టిన ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాని పిలుపునిచ్చారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు.

లారీ డ్రైవర్ రిమాండ్

ఏటూరునాగారం: మద్యం తాగి లారీ నడిపి వ్యక్తి మృతికి కారణమైన లారీ డ్రైవర్ బొంత రమేశ్‌ను రిమాండ్ చేసినట్లు ఎస్సై రాజ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నబోయినపల్లి వద్ద శివాపురం గ్రామానికి చెందిన సీలోజు భాస్కరచారి(65) శనివారం రాత్రి బస్ స్టాప్ వద్ద తన భార్య కోసం రోడ్డుపై ఎదురుచూస్తుండగా హైదరాబాద్ నుంచి ఏటూరునాగారం వచ్చే లారీ డ్రైవర్ మద్యం తాగి అజాగ్రత్తగా అతివేగంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో మృతుడి కుమారుడు సీలోజు రాజేశ్వరచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ బొంత రమేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పరామర్శ



పరామర్శిస్తున్న లక్ష్మీనర్సింహారావు

ములుగు రూరల్: జేడీ మల్లంపల్లి మండలం శ్రీనగర్‌గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు రాముల నాయక్ తండ్రి కొమ్ముాలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు ఆదివారం పరామర్శించారు. అలాగే పార్టీ నాయకుడు ఆకుల రమేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఆయనను పరామర్శించారు. పోరిక గోవింద్‌నాయక్, పాలెపు శ్రీనివాస్, ప్రదీప్‌రావు, చీదర సంతోష్, ప్రబాకర్, రవి, దేవేందర్, మల్లేష్, సోమ్లా నాయక్ తదితరులు ఉన్నారు.

ఒకరికి గాయాలు

ములుగు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన జేడీ మల్లంపల్లి మండలంలోని మహ్మద్‌గౌస్‌పల్లి వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. తెలిసిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లబెల్లి మండలం ధర్మారావుపల్లికి చెందిన రఘుపతి ద్విచక్రవాహనంపై మహ్మద్‌గౌస్‌పల్లికి వస్తున్న క్రమంలో ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. ప్రమాదంలో రఘుపతి కుడి కాలుకు తీవ్ర గాయమైంది. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించి ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం



వీఆర్‌కేపురంలో రోడ్డు పక్కన నిలిచిన మురుగు నీరు



చిరుతపల్లిలో డ్రెయినేజీలో ఉన్న పిచ్చిమొక్కలు

- గ్రామాల్లో విజృంభిస్తున్న దోమలు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు

వెంకటాపురం(కె): మండల కేంద్రంతో పాటు మండలంలోని 18 పంచాయతీల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. దీంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై పట్టించుకునే నాథుడే కరువైయ్యారని మండల ప్రజలు వాపోతున్నారు. గ్రామ పంచాయతీల్లో ఫాగింగ్ చేయక పోవడంతో పాటు కాలువల్లో పూడికతీత పనులు సైతం అధికారులు నిర్వహించడం లేదు. గ్రామ పంచాయతీలపై అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. సైడ్ కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో దుర్వాసన వస్తుందని తెలుపుతున్నారు. వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్ చేయడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, ఫాగింగ్ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



అధికారులు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను చేపట్టాలి. డ్రెయినేజీల్లో పూడిక తీయకపోవడంతో మురుగు నిల్వ ఉండి దోమలు పెరిగిపోతున్నాయి. ఫాగింగ్ కూడా నిర్వహిండం లేదు. దింతో గ్రామాల్లో ఇబ్బంది పడుతున్నాం.

- తంగెల్లపల్లి ప్రసాద్

రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలి



ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ములుగు రూరల్: రాయినిగూడెం నుంచి సర్వాపూర్ వెళ్లేదారి గుంతలమయంగా మారిందని మరమ్మతు పనులు చేపట్టాలని సీపీఎం నాయకుడు గుండబోయిన రవిగౌడ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం పార్టీ నాయకులు రోడ్డుపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ గ్రామాలకు వెళ్లేదారి గుంతమయంగా మారి వర్షపు నీరు చేరి అధ్వానంగా ఉందని పలుమార్లు అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రోడ్డు నిర్మాణ పనుల్లో కల్వర్టుల వద్ద కంకర పోసి వదిలేయడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందుతులు పడుతున్నారని అన్నారు. ఉన్నతాధికారులు రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండమీది వెంకటేశ్వర్లు, కృష్ణ, రమేష్, నర్సయ్య, ప్రశాంత్, రాములు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో అభిషేకాలు



శివలింగానికి అభిషేకాలు చేస్తున్న లక్ష్మీనర్సింహారావు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌కు చెందిన సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మహాన్యాస అభిషేకాలు, ఏకాదశ రుద్రాభిషేకం పూజలను ఘనంగా నిర్వహించారు. సత్యసాయి బాబా శతజయంతి వేడుకలో భాగంగా శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, శివం హైదరాబాద్ వారి వేద పండితుల బృందం వారిచే మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు హాజరై అభిషేకాలను నిర్వహించారు. ఏకారుద్రాభిషేకానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు హాజరై ప్రత్యేక పూజలు, అభిషేకాలను చేశారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా దేవాలయం చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, భిక్షపతి, వర లక్ష్మీమేడం, సతీష్, మైనర్ బాబు, లక్ష్మణ్‌చారి, భానుప్రకాష్, గంజి రమేష్, శివం హైదరాబాద్ సంస్థ సభ్యులు ఉమామహేశ్వర రావు, రవీందర్‌గుప్త, రాజిరెడ్డి, సాయిభార్గవ, మహిళలు పాల్గొన్నారు.

వెలమ కులస్తులు సంఘటితం కావాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

ములుగు రూరల్: వెలమ కులస్తులు సంఘటితం కావాలని ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నడిపల్లి వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం జిల్లాలోని లీలా గార్డెల్‌లో నిర్వహించిన వెలమ సంక్షేమ సంఘం సభ్యత్వ నమోదుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వెలమ సామాజిక వర్గంలో వెనకబడిన వారికి సంఘం ద్వారా సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌తో పాటు హనుమకొండ హంటర్ రోడ్డులో సంక్షేమ హాస్టల్ వసతి కల్పిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెలమ సంఘం గౌరవ అధ్యక్షుడు జలగం మోహన్‌రావు, కన్వీనర్ వేల్పూరి సత్యనారాయణరావు, లింగంపల్లి పాఆపరావు, గండ్ర గోపాల్‌రావు, వెంకటేశ్వర్‌రావు, అమృత్‌రావు, శ్రీనివాస్‌రావు, శ్రీదర్‌రావు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతల పూడ్చివేత



మరమ్మతులు చేస్తున్న గ్రామస్తులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని సీతారామ్‌పురం గ్రామస్తులు ఆదివారం గ్రామంలో రోడ్లపై ఉన్న గుంతలను సొంత ఖర్చులతో పూడ్చారు. గ్రామంలో రోడ్లు అన్ని గుంతలమయంగా మారి ఇబ్బందులు పడుతున్నామని, మురుగు నీరు నిల్వ ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. రోడ్డుకు మరమ్మతు చేయించాలని అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లిన వారు పట్టించుకోలేదని వాపోయారు. దీంతో చేసేది ఏమి లేక గ్రామంలోని ప్రతీ ఇంటికి డబ్బులు వసూలు చేసుకోని సొంత ఖర్చులతో మరమ్మతు చేసుకున్నామని తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సూర్య



క్రీడాకారులతో సూర్య

ములుగు రూరల్: యువత చదువుతో పాటు క్రీడాల్లో రాణించాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సూర్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో బాస్కెట్ బాల్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారును ఆయన అభినందించి మాట్లాడారు. నిత్యం క్రీడల్లో సాధన చేస్తే మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. యువత క్రీడా స్పూర్తితో ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సన్ రైజస్ హైస్కూల్ కరస్పాండెంట్ రాజు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుమన్‌రెడ్డి, నాయకులు నల్లేల భరత్ కుమార్, రేవంత్, పీఈటీలు శ్రీకాంత్, కోచ్ వంశీ తదితరులు ఉన్నారు.

చర్య తీసుకోవాలి



ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ములుగు రూరల్: దళితబంధు పథకంలో అవినీతికి పాల్పడిన వారిపై విచారణ చేసి చర్య తీసుకువాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మెట్టువాడ తిరుపతి అన్నారు. ఈ మేరకు ఆదివారం అవినీతికి పాల్పడిన వారిపై డీఎస్పీ రవీందర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకం ఇప్పిస్తామని అమయాక దళితుల వద్ద నుంచి రూ.లక్షలు కాజేసి మోసం చేశారని అన్నారు. డబ్బులు ఇచ్చిన వారు తిరిగి అడగడంతో దళితబంధు సాధన సమితి పేరుతో నాటకాలు ఆడుతూ అమాయకులను మోసం చేస్తున్నారని అన్నారు. దళారుల నుంచి కాపాడి బాధితులకు న్యాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంగోత్ వంశికృష్ణ, అర్శం రఘు, గూడెపు రాకేష్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సుదర్శన్‌రావు



మాట్లాడుతున్న సుదర్శన్‌రావు

ములుగు రూరల్: జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 09న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సుదర్శన్‌రావు అన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని కాశిందేవిపేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని అన్నారు. లేబర్ కోడ్‌ల కారణంగా కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని అన్నారు. కార్మికులు పోరాటలతో సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేయడం సరికాదని అన్నారు. కార్పొరేట్ కంపెనీలకు ప్రభుత్వం రూ.16లక్షల 35 వేల కోట్ల మాఫీ చేసిందని అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుమ్మల వెంకట్‌రెడ్డి, బందారు రవికుమార్, సూడి కృష్ణారెడ్డి, సాంబశివ, రాజేందర్, వాసు, రఘుపతి, చిట్టిబాబు, దావూద్, మల్లారెడ్డి, దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

మంగపేట: మండలంలోని కమలాపురానికి చెందిన అన్నం మణికంఠ కొద్ది నెలల క్రితం నిద్రలో బిల్డింగ్ మీదనుంచి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. అప్పుచేసి వైద్యం చేయించుకుని ఇంటికి వచ్చాడు. దీంతో జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ ని ర్వాహకులు నరేష్, రాకేష్ దాతల ద్వారా సేకరించి న డబ్బులతో నెల రోజులకు సరిపడ నిత్యావసర సరుకులు బాధిత కుటుంబానికి అందజేశారు. అశోక్, తేజ, నగేష్, ఇంతియాజ్, సాయి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మొహర్రం



పీరీలను ఊరేగిస్తున్న ఆచారమంతులు

రేగొండ(కొత్తపల్లిగోరి): కొత్తపల్లిగోరి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలను ఆదివారం నిర్వహించుకున్నారు. కులమతాలకు అతీతంగా ప్రజలంతా వేడుకలలో పాల్గొన్నారు. ఉదయం నుంచి డప్పుల చప్పుళ్ల మధ్య పీరీలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు బిందెలతో నీళ్ల తెచ్చి పీరీలను ఎత్తుకున్న వారి పాదాలను శుభ్రం చేసి, పీరీలకు కుడుకలు, రంగుల దట్టీలను ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పీరీలను మఖానంలో ఉంచి అగ్ని గుండంలో పాలు పొంగించారు. కోరిన కోరికలు నెరవేరిన భక్తులు మజీదు వద్ద మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చి కందూరు నిర్వహించారు. పీర్ల చావిడి దగ్గర కొలువుదీరిన పీర్లను సందర్శించిన భక్తులకు బెల్లం పానకాన్ని పంచి పెట్టారు. సాయంత్రం పుర వీధుల్లో పీర్లను ఊరేగించిన అనంతరం గ్రామ శివారులోని పురాతన బావి వద్ద పీర్లను ఉపసంహరించారు. కొత్తపల్లిగోరి మండల కేంద్రంలోని జాతరకు చుట్టూ పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో జాతర ప్రాంగణామంతా కిక్కిరిసి పోయింది. జాతరలో పలు దుకాణాలు ఏర్పాటు చేశారు.

క్రీడలతో మానసికోల్లాసం

- మాజీ ఎంపీపీ సమ్మయ్య



క్రీడా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కాటారం: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. అంతర్జాతీయ బ్యాట్మింటన్ డేను పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఆదర్శకాలనీలో ఆదివారం షటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. 12 జట్లు పోటీల్లో పాల్గొనగా ఆదర్శకాలనీకి చెందిన ఆత్మకూరి కుమార్, మెరుగు వరుణ్ ప్రథమ స్థానంలో నిలవగా హట్కర్ రమేష్, మారుపాక రాజేంద్రప్రసాద్ ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పంతకాని సమ్మయ్య విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు ఓలపు శ్రీనివాస్, పున్నం రమేష్, నందు, నవీన్, ఉదయ్, వరుణ్, రితిష్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రుల పర్యటనతో మరమ్మతులు



ఆదివారం మధ్యాహ్నం బురదమయంగా ఉన్న రోడ్డు



సాయంత్రం మరమ్మతు చేసిన రోడ్డు

మంగపేట: మండల కేంద్రంలోని గంపోనిగూడెం వద్ద అమరవీరుల స్తూపం సెంటర్ నుంచి వై జంక్షన్ వరకు చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. నేడు(సోమవారం) మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ నూతన భవన ప్రారంభోత్సవానికి మంత్రి సీతక్క, తుమ్మల నాగేశ్వర్‌రావు వస్తుండడంతో ఆగ మేఘాల మీద పంచాయతీ అధికారులు పోలీస్‌స్టేషన్ ఎదుట, బొడ్రాయి సెంటర్ తదితర ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం కంకర పోశారు. గతంలో ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోని అధికారులకు మంత్రులు వస్తేనే మరమ్మతు గుర్తుకువచ్చిందా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత



సెల్‌ఫోన్లు అందజేస్తున్న ఎస్సై శ్రీనివాస్

కాటారం: మండలంలో పలు చోట్ల పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను ఎస్సై–2 శ్రీనివాస్ బాధితులకు ఆదివారం అందజేశారు. కాటారానికి చెందిన ఆనంద్, మల్హర్ మండలం రుద్రారానికి చెందిన రాజబాబు ఇటీవల సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్నారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసిన పోలీసులు సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి అప్పగించారు.

అప్పల బాధతో మాజీ ఎంపీటీసీ ఆత్మహత్యాయత్నం..

- చికిత్స పొందుతూ మృతి



శ్యాంలాల్(ఫైల్)

మంగపేట: అప్పల బాధతో ములుగు జిల్లా మంగపేట మండలంలోని కమలాపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ లావుడ్యా శ్యామ్‌లాల్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతి చెందినట్లు ఎస్సై సూరి తెలిపారు. గ్రామంలోని టీడీపీ కాలనీకి చెందిన శ్యాంలాల్(58) తన గుండె ఆపరేషన్ కోసం గతంలో అప్పు చేశాడు. అయితే అప్పుల బాధతోపాటు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న శ్యాంలాల్.. ఈనెల 04న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి వరంగల్ ఎంజీఎంలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఉమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

ఆషాఢమాస గోరింటాకు సంబురాలు



గోరింటాకుతో మహిళలు

కాటారం: ఆషాఢమాసంను పురస్కరించుకొని మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం బటర్ ఫ్లై కిట్టి పార్టీ మహిళా స్నేహితుల బృందం కలిసి గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ఒకరికి ఒకరు గోరింటాకు పెట్టుకొని ఉత్సాహంగా గడిపారు. అనంతరం పలువురు మహిళలు మాట్లాడుతూ.. ఆషాడమాసంలో గోరింటాకు పెట్టుకోవడం వల్ల ఆరోగ్యానికి ప్రయోజనం కల్గుతుందన్నారు. సహజసిద్ధంగా ఉండే గోరింటాకులోని ఔషధగుణాలు శరీరంలోకి ఇమిడిపోయి మేలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్కుల శ్రీలతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.